

రేపటి నుంచి కోవై, తిరుప్పూర్ జిల్లాల్లో
సీఎం స్టాలిన్ పర్యటన

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 22, 23వ తేదీల్లో కోవై, తిరుప్పూర్ జిల్లాల్లో పర్యటిస్తారని సచివాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం చెన్నై నుంచి విమానంలో కోవై చేరుకోనున్న సీఎం అక్కడినుంచి రోడ్డు మార్గం గుండా తిరుప్పూర్ వెళతారు. వేలంపాళయంలో ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కోవిల్‌వళి ప్రాంతంలో బస్‌స్టేషన్ ప్రారంభించి, ఆ రోజు సాయంత్రం మడతకుళంలో కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 23వ తేదీ ఉదయం ఉడుమలై బస్‌స్టేషన్ పెరియార్, అన్నా, కలైంజర్, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించి నేతాజీ గ్రౌండులో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక్కడి నుంచి కోవై జిల్లా పొల్లాచ్చి వెళ్ళనున్న సీఎం స్టాలిన్ దివంగత మాజీ సీఎం కామరాజర్, కేంద్రమాజీ మంత్రి సి.సుబ్రమణ్యం, వీకే పళనిస్వామి గౌండర్, మాజీ ఎమ్మెల్యే పొల్లాచ్చి మహాలింగం విగ్రహాలను ఆవిష్కరిస్తారు. అదే వేదికపై రైతుల కొ౦టు౦ బాల కోసం ఆడిటోరియం ప్రారంభించి అదే రోజు సాయంత్రం కోవైనుంచి విమానంలో నగరానికి తిరిగొస్తారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని ఈ రెండు జిల్లాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రెండు జిల్లాలకు రెడ్ అలర్ట్

రాష్ట్రానికి మూడు రోజుల పాటు వర్ష సూచన

అడయార్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే, కన్నియాకుమారి, నీలగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించి, ఆ రెండు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. నైరుతి పవనాల సీజన్‌తో పాటు బంగాళాఖాతంలో వేడిగాలుల ప్రభావం అధికంగా ఉండటంతో రాష్ట్రానికి వర్షసూచన చేసింది. ముఖ్యంగా ఉత్తర జిల్లాలైన చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, పశ్చిమ కనుమల జిల్లాలైన నీలగిరి, కోవై, తేని సహా డెల్టా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాజధాని చెన్నై నగరంలో మాత్రం వాతావరణం రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది.

28న శ్రీవిల్లిపుత్తూరులో
ఆడిపూర రథోత్సవం

ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు



స్వర్ణాలంకారశోభితంగా ఆండాళ్, రంగమన్నార్

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ దివ్యదేశాల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ (గోదాదేవి) ఆలయంలో ఈ నెల 28న ఆడిపూర రథోత్సవం జరుగనుంది. ఆడిపూర ఉత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. శ్రీవిల్లిపుత్తూరు దివ్యదేశం ఆండాళ్, పెరియాళ్వార్ (విష్ణుచిత్తులు) ఇలా ఇద్దరు ఆళ్వార్లు వెలసిన క్షేత్రం. ఈ ఆలయంలో ప్రతియేటా ఆండాళ్ అవతార దినమైన ఆడి మాసంలో వచ్చే పూర్వ ఫల్గుణి నక్షత్రం రోజున మహారథోత్సవం నిర్వహిస్తారు. ఈ మేరకు ఈ యేడాది ఆడిపూర రథోత్సవ వేడుకలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. అంతకు ముందు ఆండాళ్, రంగమన్నార్‌లకు తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజాన్ని మాడవీధుల్లో ఊరేగించి, ధ్వజస్తంభ మంటపానికి ఆలయ ప్రధానార్చకులు, వైష్ణవభట్టార్లు తీసుకొచ్చారు. ధ్వజస్తంభానికి అభిషేకం జరిపి పూలు, సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. ఉదయం ఎనిమిది గంటలకు గరుడ ధ్వజారోహణం నిర్వహించారు. ఆదివారం రాత్రి ఆండాళ్, రంగమన్నారు షోడశ సప్పరంలో చతుర్మాడ వీధుల్లో ఊరేగారు. ఈ నెల 24న పెరియాళ్వార్ మంగళాశాసనం, పంచ గరుడ సేవలు, 26న శయన సేవ జరుగనుంది. ఈ నెల 28 ఉదయం 9.05 గంటలకు ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన 'తిరు ఆడి పూర' రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులందరికీ ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పీఆర్ వెంకటరామరాజా, సభ్యులు, కార్యనిర్వాహణాధికారి తదితర అధికారులు తగు సదుపాయాలు కల్పించనున్నారు.



అధికారంలో భాగమిచ్చేందుకు
మేం చవటలమా?

● బీజేపీ నేతలకు ఎడప్పాడి షాక్

అడయార్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకే సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అదే సమయంలో అధికారంలో భాగస్వామ్యం ఇవ్వడానికి తాము చవటలం కామని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి స్పష్టంచేశారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఆయన ఇప్పటి నుంచే ప్రచారం చేస్తున్నారు. శనివారం రాత్రి తిరువారూర్ జిల్లాలోని తిరుత్తురైపూండిలో జరిగిన బహిరంగ సభలో ఎడప్పాడి ప్రసంగించారు. తన బంధువుల నివాసగృహాల్లో ఐటీ, ఈడీ సోదాలు జరగడం వల్లే తాను బీజేపీతో పొత్తు పెట్టుకున్నట్టుగా రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ ఆరోపించారని, వాస్తవానికి తన బంధువు ఇళ్లలో ఎలాంటి సోదాలు జరగలేదన్నారు. ఒక వేళ సోదాలే జరిగివుంటే, దానికి తనకు ఏమిటి సంబంధమని ఆయన ప్రశ్నించారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే మెజార్టీ స్థానాలను గెలుచుకుని అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడంపై డీఎంకే నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారని, ఎన్నికల కోసం పొత్తులు పెట్టుకుంటే తప్పేంటి అని ఎడప్పాడి ప్రశ్నించారు. తాము బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతోనే అధికార డీఎంకే కూటమిలోని పార్టీల్లో గుబులు మొదలైందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ మాత్రమే సంపూర్ణ మెజార్టీతో విజయం సాధించి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న లక్ష్యంతో ఉన్న పార్టీలతో చేతులు కలిపి ముందుకుసాగుతున్నామన్నారు. తమ కూటమిలోకి మరికొన్ని పార్టీలు రానున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 స్థానాల్లో గెలుస్తుందని సీఎం స్టాలిన్ పదే పదే చెబుతున్నారని, నిజానికి 210 స్థానాల్లో గెలిచేది అన్నాడీఎంకే మాత్రమేనన్నారు. మా కూటమికి అన్నాడీఎంకే సారథ్యం వహిస్తుందని, అన్నాడీఎంకే మాత్రమే సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ప్రభుత్వంలో ఇతరులకు భాగస్వామ్యం ఇచ్చేదిలేదని ఎడప్పాడి పళనిస్వామి స్పష్టం చేశారు.

కాబోయే డిప్యూటీ సీఎం నయినార్

● అరియలూరు సభలో కార్యకర్తల నినాదాలు



నయినార్ నాగేంద్రన్‌కు వెండి రాజదండం బహూకరిస్తున్న బీజేపీ శ్రేణులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రానున్నది సంకీర్ణ ప్రభుత్వమేనని, అధికారంలో భాగస్వామ్యం పొందుతామని బీజేపీ రాష్ట్ర నేతలు చెబుతుండగా, సొంతమెజారిటీతోనే తమ పార్టీ గెలుస్తుంది కనుక అసలు సంకీర్ణ ప్రభుత్వానికే తావుండదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. ఈ వివాదాన్ని పక్కనబెడితే తాజాగా అరియలూరులో బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ పాల్గొన్న సభలో పార్టీ కార్యకర్తలంతా కలిసి 'కాబోయే ఉప ముఖ్యమంత్రి నయినార్ నాగేంద్రన్ వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఊహించిన ఈ పరిమాణానికి నాగేంద్రన్ షాక్‌కు గురయ్యారు. ఈలోగా కార్యకర్తలు డిప్యూటీ సీఎం నయినార్ అంటూ ఆంగ్లంలోనూ నినాదాలు చేశారు. అరియలూరు జిల్లా జయంకొండంలో ఈ నెల 27న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆదివారం ఉదయం ఆయన స్థానిక అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రధాని పాల్గొనే సభా వేదిక నిర్మించనున్న ప్రాంతాన్ని కూడా తనిఖీ చేశారు. ఆ తర్వాత ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై స్థానిక పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, ప్రముఖులు నయినార్ నాగేంద్రన్‌ను గజమాలతో సత్కరించి, వెండి రాజదండాన్ని కానుకగా అందజేశారు. ఈ సభలో పార్టీ నేతలు కేశవవినాయగం, కరుప్పు మురుగానందం మాజీ జిల్లా అధ్యక్షుడు అయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు.

అరియలూరు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు పరమేశ్వరి స్వాగతోపన్యాసం చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాబోయే ఉప ముఖ్యమంత్రి నయినార్ నాగేంద్రన్ అని సంబోధించడంతో సభికులంతా హర్షం వ్యక్తంచేశారు. తనను అలా సంబోధించవద్దని నయినార్ నాగ్రేందన్ వేదికపై నుండి సైగలు చేస్తున్నా కార్యకర్తలు మరింత రెచ్చిపోయి డిప్యూటీ సీఎం నయినార్ నాగేంద్రన్ అంటూ అంగ్లంలో కేకలు పెట్టారు. ఆ తర్వాత నాగేంద్రన్ మందలించడంతో వారు మౌనం పాటించారు.

మదురై ఆధీనాన్ని విచారించిన
సైబర్ క్రైం పోలీసులు



విచారణలో పడుకునే సమాధానాలిస్తున్న మదురై ఆధీనం

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తనను హత్యచేసేందుకు కుట్ర జరిగిందంటూ ఇరు మతాల మధ్య చిచ్చు రగిల్చేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నమోదైన కేసులో మదురై ఆధీనంను సైబర్ క్రైం పోలీసులు ఆదివారం విచారణ జరిపారు. మేలో చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కుళత్తూరులో ధర్మపురం ఆధీనం ఆధ్వర్యంలో ఏర్పాటైన శైవసిద్ధాంత మహానాడులో పాల్గొనేందుకు మదురై ఆధీనం కారులో వచ్చారు. ఆ కారు ఉలుందూరుపేట - సేలం రౌండ్‌ఠాణా ప్రాంతం వద్ద వెళ్తుండగా మరో కారు ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఆ సంఘటన గురించి మదురై ఆధీనం మహానాడులో ప్రస్తావిస్తూ తన కారును ఢీకొట్టి తనను హత్య జరిగేందుకు కుట్ర జరిగిందని, ఆ కుట్ర వెనుక పాకిస్తాన్ హస్తం ఉందన్నారు. మదురై ఆధీనం చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో కలకలం సృష్టించాయి. మదురై ఆధీనం రెండు మతాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యాఖ్యలు చేశారని, అంతే కాకుండా ఆ వ్యాఖ్యలన్నీ అసత్యాలంటూ చెన్నైకి చెందిన న్యాయవాది రాజేంద్రన్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మదురై ఆధీనంపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనను అరెస్టు చేస్తారనే అనుమానంతో మదురై ఆధీనం చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో బెయిలు పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సెషన్స్‌కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కారు ప్రమాదం సంఘటపై మతచిచ్చు రగిల్చేలా వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో ఆదివారం ఉదయం చెన్నై ఈస్ట్‌జోన్ సైబర్ క్రైం పోలీసులు విచారణ ప్రారంభించారు. మీనాక్షి అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న ఆధీన మఠంలోనే ఈ విచారణ జరిగింది. ఈ విచారణకు వెళ్లిన చెన్నై సైబర్ క్రైం పోలీసులను మఠంలోకి వెళ్ళకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. స్థానిక పోలీసులు జోక్యం చేసుకుని అందరినీ అక్కడి నుండి తొలగించారు. విచారణ సందర్భంగా మఠంలో ఆధీనం మినహా ఎవరూ ఉండకూడదని సైబర్ క్రైం పోలీసులు ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత లేవలేనిస్థితిలో ఉన్న మదురై ఆధీనం వాంగ్మూలాన్ని సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసుకున్నారు.



సోదరుడు ముత్తు మరణంతో బాధలో ఉన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పరామర్శిస్తున్న నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ తదితరులు

పీఎంకే నుంచి ముగ్గురు ఎమ్మెల్యేల సస్పెన్షన్

● ప్రకటించిన రాందాస్



చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ కీర్తి ప్రతిష్ఠతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారంటూ పాట్టాలి మక్కల్ కట్చికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ సస్పెండ్ చేశారు. ఆ ముగ్గురిపై విచారణ జరుపనుండటంతో పార్టీ శ్రేణులు వారితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోకూడదని కూడా ఆదేశించారు. పీఎంకే ఎమ్మెల్యేలు శివకుమార్, సదాశివం, వెంకటేశ్వరన్‌తోపాటు పార్టీకి చెందిన న్యాయవాది కే బాలుపై కూడా సస్పెన్షన్ వేటుపడింది. పార్టీ వ్యవస్థాపకుడైన తన ఉత్తర్వులకే కట్టుబడాల్సి ఉంటుందన్నారు. గత కొద్ది నెలలుగా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ క్రమశిక్షణ ఉల్లఘించి పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రకటనలు చేయడం గర్హనీయమన్నారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ ఈ ముగ్గురి ప్రవర్తనపై సమగ్రంగా విచారణ జరిపి తనకు నివేదిక సమర్పించిందని, కమిటీ సిఫారసు మేరకే ముగ్గురిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నామని చెప్పారు. వీటన్నింటికి తోడుగా శాసనసభలో పార్టీ విప్‌గా ఉన్న ఎమ్మెల్యే అరుళ్‌ను ఆ పదవి నుండి తొలగించినట్లు స్పీకర్‌కు తప్పుడు సమాచారం అందించడంలో ఈ ముగ్గురు శాసనసభ్యులు, న్యాయవాది బాలు కీలక పాత్ర వహించారని డాక్టర్ రాందాస్ ఆరోపించారు. త్వరలో ఈ నలుగురిని పార్టీపరంగా విచారించనున్నామని, వారు తనకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

● నలుగురి దుర్మరణం



ఘటనా స్థలంలో పోలీసులు, స్థానికులు

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుకోవిలూర్ సమీపంలో అదుపుతప్పిన కారు గోతిలో పడిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. విల్లుపురం జిల్లా టి.దేవనూరు గ్రామానికి చెందిన మాధవన్ (44) విల్లుపురం సాయుధదళంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం టి.దేవనూరు నుంచి తిరువణ్ణామలై ఆలయానికి కారులో బయలుదేరారు. మాధవన్ డ్రైవ్ చేస్తుండగా అతడితోపాటు భార్య మేనక (35), కుమార్తె కోషిక, బంధువులు సంగీత (30), శుభ (55), ధనలక్ష్మి (70), రాఘవేంద్రన్ (13) మరో ఇద్దరు కారులో వెళ్తున్నారు. కాట్టుకోవిల్ మార్గంగా కారు హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కన లోతట్టు ప్రాంతంలో పడింది. ఈ ఘటనలో సంగీత, శుభ, ధనలక్ష్మి, రాఘవేంద్ర ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మాధవన్, భార్య మేనక, కుమార్తె కోషిక సహా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మనలూరుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అలాగే, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మూడోసారి నిండిన మేట్టూరు జలాశయం

● పరీవాహక ప్రాంతాలకు వరద హెచ్చరిక



డ్యామ్ నుండి విడుదలవుతున్న నీరు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కావేరి డెల్టా జిల్లాలకు సాగునీరందించే ప్రధానమైన జలాశయం మేట్టూరు డ్యామ్ ఈ యేడాది ముచ్చటగా మూడోసారి పూర్తిస్థాయిలో నిండటంతో డెల్టా రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. అదే సమయంలో కావేరి తీర ప్రాంతాల్లోని ప్రజలకు అధికారులు వరద హెచ్చరిక చేశారు. నైరుతి రుతపవనాల ప్రభావం కారణంగా కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కేరళలోని కబిని, కర్ణాటకలోని కృష్ణరాజసాగర్ డ్యాంల నుండి అదనపు జలాలు వస్తుండడంతో డ్యామ్‌లో ఆదివారం ఉదయానికి 120 అడుగుల మేర నీటిమట్టం పెరిగి పూర్తిస్థాయికి చేరింది. ప్రస్తుత యేడాది తొలిసారిగా జూన్ 29న ఈ డ్యామ్‌లో నీటిమట్టం 120 అడుగులకు పెరిగింది. సాగునీరు విడుదల చేయడంతో జూలై 3 నుండి నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వచ్చింది. రెండు రోజుల తర్వాత ఈ నెల 5న డ్యామ్ నీటిమట్టం రెండోసారి పూర్తిస్థాయికి చేరింది. ఆ తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యామ్‌లోకి వచ్చే నీటి పరిమాణం తగ్గింది. డ్యామ్ నీటిమట్టం 14న ఉన్నట్టుండి తగ్గింది. ఆ తర్వాత గత మూడు రోజులుగా కర్ణాటకలోని కావేరి పరీవాహక ప్రాంతాల్లో మళ్ళీ భారీగా వర్షాలు కురవటంతో కృష్ణరాజ్‌సాగర్ డ్యాంలో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరటంతో అదనపు జలాలను విడుదల చేశారు. ఆ నీరంతా మేట్టూరు డ్యామ్‌లోకి ప్రవేశించాయి. ఆదివారం ఉదయం ఆ డ్యామ్‌లోకి ప్రవేశించే జలాల పరిమాణం సెకనుకు 31500 ఘనపుడగుల మేరకు పెరిగింది. దీంతో డ్యామ్‌లో మళ్లీ 120 అడుగుల మేరకు నీటిమట్టం పెరగటంతో అధికారులు అదనపు జలాలను 16 గేట్ల ద్వారా విడుదల చేయానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో ఆ డ్యామ్ నుంచి విడుదలయ్యే జలాల కారణంగా కావేరి పరీవాహక ప్రాంతాల్లో ప్రత్యేకించి పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు చేశారు. కావేరి డెల్టాలోని సాగుభూములకు హైడల్ విద్యుత్ కేంద్రాల మీదుగా నీరు విడుదల చేస్తున్నారు. తూర్పు, పడమటి కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 93.47 టీఎంసీల మేరకు జలాలున్నాయని ఇరిగేషన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. డ్యామ్‌నుంచి అదనపు జలాలు విడుదల చేయనుండటంతో కావేరి నదీ తీరాల్లో తగమారిపట్టినం, అన్నానగర్, పెరియార్ నగర్, పుదుపాలం, తొట్టిల్‌పట్టి ప్రాంతాలకు అధికారులు వరద హెచ్చరికలను ప్రకటించారు. ప్రస్తుతం డ్యామ్ వద్ద అగ్నిమాపక దళం, విపత్తుల నిర్వహణ బృందం సభ్యులు నిఘా వేస్తున్నారు.



మైకులో వరద హెచ్చరికలు చేస్తున్న అధికారి

సమాచార దర్శిని

28 నుంచి గ్రూప్-2 పోస్టులకు ఇంటర్వ్యూ

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పోస్టులకు ఈ నెల 28 నుంచి ఇంటర్వ్యూ ప్రారంభం కానుంది. ఈ విషయమై ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) విడుదలచేసిన ప్రకటనలో... గ్రూప్-2 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మార్కులు, ర్యాంకుల జాబితా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశామన్నారు. ర్యాంకుల ఆధారంగా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 1వ తేది వరకు జరుగుతుందని ప్రకటించారు. అలాగే, గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన 8వ విడత సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఈ నెల 25వ తేది జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

ఉచిత యోగా శిక్షణ

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సన్యాసి కృష్ణా యోగం ఆధ్వర్యంలో వేళచ్చేరి, కేకే నగర్, నంగనల్లూర్‌లో నాలుగు వారాల ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. వేళచ్చేరిలో ఈ నెల 26, కేకే నగర్‌లో 27, నంగనల్లూర్‌లో 25వ తేది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. వేళచ్చేరి తిరువీధి అమ్మన్ ఆలయ వీధి, కేకే నగర్ పొన్నాంబళం రోడ్డు అయ్యప్పన్, గోశాల కృష్ణన్ ఆలయం, నంగనల్లూర్ లక్ష్మీ నగర్ మెయిన్ రోడ్డు సుదర్శన్ టెర్రస్‌లో ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు (సోమవారం నుంచి శనివారం వరకు) నిర్వహించనున్నారు. వివరాలు, పేరు నమోదుకు వేళచ్చేరి (8754499334, 9445051015), కేకేనగర్ (6383008358), నంగనల్లూర్ (9841227709) నెంబర్లు సంప్రదించవచ్చని నిర్వాహకులు కోరారు.

విద్యార్థుల పేర్ల సవరణకు నిబంధన

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్ టూ విద్యార్థుల పేర్ల సవరణకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ నిబంధన విధించింది. విద్యార్థులు, టెన్త్, ప్లస్ టూ మార్కుల జాబితాలో తమ పేరు, పుట్టిన తేది, తల్లిదండ్రుల పేరు తదితరాలు మార్చడంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో, విద్యార్థులు సవరణలు కోరితే, వారి ఒరిజినల్ మార్కుల జాబితా, ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన బదిలీ సర్టిఫికెట్, ప్రధానోపాధ్యాయుడి సిఫారసు లేఖ, పాఠశాల అడ్మిషన్ నెంబరు, జనన ధృవీకరణ పత్రం నకలు తదితరాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన అనంతరం పేర్లు, వివరాల్లో సవరణ చేపట్టనున్నారు. ఈ సర్టిఫికెట్లు లేని దరఖాస్తులను పరిశీలించమని ప్రభుత్వ పరీక్ష శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరి జిల్లా ప్రధాన విద్యాధికారులకు ఉత్తర్వులు జారీచేశారు.

పార్ట్ టైం ఉపాధ్యాయుల ఆందోళన విరమణ

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సమస్యల సాధనకు పన్నెండు రోజులుగా చేపట్టిన ఆందోళనలు తాత్కాలికంగా విరమించుకున్నట్లు ఉపాధ్యాయుల సంఘం ప్రకటించింది. ఉద్యోగాల క్రమబద్ధీకరణ సహా పలు డిమాండ్ల సాధనకు ఈ నెల 8 నుంచి డీపీఐ కార్యాలయం ఎదుట పార్ట్ టైం ఉపాధ్యాయులు ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో, పార్ట్ టైం ఉపాధ్యాయులకు త్వరలో శుభవార్త చెబుతామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ శనివారం ప్రకటించారు. మంత్రి హామీ మేరకు ఆందోళన తాత్కాలికంగా విరమించుకుంటున్నామని, హామీ అమలు చేయని పక్షంలో మళ్లీ ఆందోళనలు చేపడతామని సంఘం నాయకులు ప్రకటించారు.

రేపటి నుంచి వెటర్నరీ కోర్సులకు కౌన్సెలింగ్

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ వైద్య కోర్సుల కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు వెటర్నరీ యూనివర్శిటీ విడుదల చేసిన ప్రకటనలో... 2025-26వ విద్యా సంవత్సరానికి బీవీఎస్సీ, ఏహెచ్, బీటెక్ కోర్సుల ర్యాంకుల జాబితా ఈ నెల 14న విడుదల చేశామన్నారు. ఈ కోర్సులకు కౌన్సెలింగ్ తమిళనాడు వెటర్నరీ విశ్వవిద్యాలయంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుంది. తొలిరోజు దివ్యాంగులు, మాజీ సైనికుల వారసులు, క్రీడాకారులు తదితర ప్రత్యేక విభాగాలకు కౌన్సెలింగ్ జరుగనుంది. బుధవారం ఉదయం 9.30 గంటలకు 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కౌన్సెలింగ్ జరుగనుంది. ఈ రెండు రోజులు ప్రత్యక్ష కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీచేయనున్నారు. జనరల్ విభాగంలో తొలివిడత కౌన్సెలింగ్ ఈనెల 24వ తేది ఉదయం 10 గంటల నుంచి https://adm.tanuvas.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సు, కళాశాలను ఎంపిక చేసుకోవచ్చు. సీటు కేటాయింపు, అడ్మిషన్ ఉత్తర్వులు ఈ నెల 26వ తేది వర్శిటీ వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు వర్శిటీ తెలియజేసింది.

టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశం వాయిదా

పెరంబూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా కార్యదర్శుల సమావేశం పనయూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరుగనుందని, కొత్తగా రూపొందించిన యాప్‌ను పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆవిష్కరించనున్నట్లు ప్రకటన విడుదల చేశారు. కొన్ని కారణాల రీత్యా సమావేశం వాయిదావేసి, ఈ నెల 24వ తేది నిర్వహించనున్నట్లు తెలిపారు.

నత్తం వాగులో
చేపలుపట్టే వేడుకలు



సత్తిర వాగులో చేపలు పడుతున్న గ్రామస్థులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా నత్త సమీపంలోని సత్తిరవాగులో ఆదివారం ఉదయం చేపలు పట్టే వేడుకలు ఘనంగా జరిగాయి. నత్తంలోనే కాకుండా కుంభసాలై, పుదూరు, కురుమపట్టి, నల్లూరు, కోట్టైయూరు, కర్లైయూరు, అరవకురిచ్చి సహా చుట్టుపక్కల గ్రామస్థులంతా ఆ వాగులోకి దిగి చేపలవేట సాగించారు. ఈ వేడుకల్లో జిలేబీ, కురవై, పాప్‌లెట్, రోగు తదితర రకాల చేపలు చిక్కాయి. ఓ వృద్ధుడి వలలో 10 కేజీల మీసై కొళుత్తి పడింది. కేజీ నుండి 10 కేజీల దాకా చేపలు లభించడంతో వాటిని ఇళ్లకు తీసుకెళ్ళి వీధుల్లో నివసిస్తున్నవారికి ఆదివారం మధ్యాహ్నం చేపల పులుసు అన్నం వడ్డించారు.

గర్భం దాల్చిన బాలిక

● యువకుడి కోసం గాలింపు

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ విద్యార్థినిని మోసం చేసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. సేలం జిల్లా ఓమలూరుకు చెందిన 18 ఏళ్ల యువకుడు భవన నిర్మాణ పనులకు వెళ్తుంటాడు. అతడికి అరియలూరు జిల్లాకు చెందిన 17 ఏళ్ల విద్యార్థినితో ఇన్‌స్టాగ్రామ్‌లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యార్థినిని తన ఇంటికి తీసుకెళ్లిన యువకుడు, వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెను లైంగికంగా వేధించాడు. ఈ నేపథ్యంలో, భవన నిర్మాణ పనులకు వెళ్తున్న యువకుడు తనను మోసం చేసి, లైంగిక దాడి చేశాడని బాధితురాలు పిల్లల సహాయ కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దీంతో, కేంద్రం అధికారులు ఓమలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారించిన పోలీసులు, పోక్సో కింద కేసు నమోదుచేసి పరారీలో ఉన్న యువకుడి కోసం గాలిస్తున్నారు.

ముగ్గురు కుమార్తెల ప్రేమ వివాహం

● మనస్తాపంతో తల్లి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కుమార్తెలు ప్రేమ వివాహం చేసుకోవడంతో, మనస్తాపం చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కన్నియాకుమారి జిల్లాలో చోటుచేసుకుంది. రాజావూర్‌కు చెందిన ఆరోగ్యం-సహాయ మలర్ (52) దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. వీరిలో ఇద్దరు కుమార్తెలు గతంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. మూడవ కుమార్తెకు తమ చేతుల మీదుగా వివాహం చేయాలని సహాయ మలర్ ఆశపడింది. ఈ క్రమంలో, రెండు రోజుల క్రితం మూడో కుమార్తె ఓ యువకుడిని వివాహం చేసుకుని ఇంటికొచ్చింది. దీంతో, దిగ్భ్రాంతి చెందిన సహాయ మలర్ రాత్రి ఇంట్లో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు ఆమెను ఆచారిపల్లం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక శనివారం రాత్రి మృతిచెందింది.

మహిళ మెడలో నగల చోరీ

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైలులో కిటికీ పక్క సీటులో నిద్రిస్తున్న మహిళ మెడలోని నగలు చోరీ చేసిన ఆగంతకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. సేలం నుంచి తిరునల్వేలి వెళ్లేందుకు ఓ మహిళ ముంబై-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ చేసుకుంది. ఆమెకు ఎస్-2లో కిటికీ పక్కన బెర్త్ కేటాయించారు. ఈ క్రమంలో, రైలు మదురై రైల్వేస్టేషన్‌కు శనివారం తెల్లవారుజామున 4.10 గంటలకు వచ్చిన సమయంలో మహిళ తన బెర్త్‌లో నిద్రపోతోంది. ఇంతలో ఓ వ్యక్తి కిటికీలో నుంచి మహిళ మెడలోని 6 సవర్ల నగలు లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత మహిళ ఫిర్యాదుతో మదురై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి, స్టేషన్ ప్రాంగణంలోని సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఆస్పత్రిలో భార్యను హతమార్చిన భర్త



శ్రుతి (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యను భర్త హతమార్చిన ఘటన కరూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కుళిత్తలై ప్రభుత్వాస్పత్రిలో శ్రుతి (27) అనే మహిళ చికిత్స పొందుతోంది. ఆదివారం తెల్లవారుజామున ఆస్పత్రిలోకి ప్రవేశించిన శ్రుతి భర్త విన్సూద్ కత్తితో ఆమెపై దాడిచేయడంతో, ఘటనాస్థలంలోనే ఆమె మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్ని, కేసు నమోదుచేసి పరారీలో ఉన్న విన్సూద్ కోసం గాలిస్తున్నారు. కాగా, రెండు రోజుల క్రితం భర్త దాడి చేసిన కారణంగానే శ్రుతి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం కొసమెరుపు.

నీటమునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొల్లిడం నదిలో మునిగి ఇంజనీరింగ్ విద్యార్థులు మృతిచెందిన ఘటన విషాదం నింపింది. మైలాడుదురై జిల్లా శీర్గాళి తాలూకా కొండల్ మెయిన్ రోడ్డుకు చెందిన సిబిరాజ్ (20), తమ్ముడు భరత్‌రాజ్ (19), స్నేహితుడు అరుణ్‌రాజ్ (21) ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. ఆదివారం ఉదయం ముగ్గురు మంగాట్టుంగుడి గ్రామ సమీపంలోని కొల్లిడం నదిలో స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తున్న ముగ్గురు లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగిపోయారు. గమనించిన చుట్టుపక్కల వారు భరత్‌రాజ్‌ను రక్షించారు. సమాచారం అందుకున్న శీర్గాళి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గంట సేపు శ్రమించి సిబిరాజ్, అరుణ్‌రాజ్ మృతదేహాలు వెలికితీశారు. దీనిపై కొల్లిడం ఆనైక్కారన్‌సత్రం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అంతర్రాష్ట్ర కార్ల దొంగ అరెస్టు

అడయార్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా నగర్‌లో అంతర్రాష్ట్ర కార్ల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. దేశ వ్యాప్తంగా 150కి పైగా కార్లను చోరీ చేసినట్టు విచారణలో వెల్లడైంది. అన్నా నగర్ పోలీటు... శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ కారు డ్రైవ్ చేసుకుంటూ వచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం తెలిసింది. ఇటీవల తిరుమంగళం ప్రాంతంలో ఒక కారు అద్దాలను పగులగొట్టి, అందులోని రూ.3 లక్షలు చోరీ చేసిన వ్యక్తిగా గుర్తించారు. ఆ తర్వాత అతడిని మరింత లోతుగా విచారించగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సత్యసింగ్ (44) అనే అంతర్రాష్ట్ర కార్ల దొంగగా తేలింది. మహారాష్ట్ర, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో 150కి పైగా కార్లను చోరీ చేసినట్టు తేలింది. 1993 నుంచి కార్లు చోరీ చేస్తున్నట్టు వెల్లడించారు. అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 20: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కీల్పాక్కం: పూందమల్లి హైరోడ్డు కొంత భాగం, శాస్త్రి నగర్, పుల్లారెడ్డి పురం, ఒళక్కులం, న్యూ భూపతి నగర్, ఫ్లవర్స్ రోడ్డు, తంబుస్వామి వీధి, గంగురెడ్డి వీధి

అంబత్తూర్: కేకే రోడ్డు, వెంకటాపురం, స్కూల్ రోడ్డు, విజయలక్ష్మి పురం, పాత ఎంటీహెచ్ రోడ్డు

● శ్రీపెరంబుదూరులో దారుణం..

మరో వ్యక్తితో మాట్లాడిందనీ ప్రియురాలి హత్య



దినేష్, సౌందర్య (ఫైల్‌ఫొటో)


అడయార్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతి మరో వ్యక్తితో మాట్లాడటాన్ని జీర్ణించుకోలేని ప్రియుడు కిరాతకానికి పాల్పడ్డాడు. ఆ యువతిని కత్తితో పొడిచి హత్య చేశాడు. శ్రీపెరంబుదూరు సమీపంలో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ హత్య వివరాలను పరిశీలిస్తే, నాగపట్టణం జిల్లాకు చెందిన దినేష్ (27), సౌందర్య (25)అనే యువతీ యువకులు శ్రీపెరంబుదూరులోని ఒక కంపెనీలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ వేర్వేరుగా అద్దె ఇళ్ళలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో వీరిమధ్య ఏర్పడిన పరిచయం ఆ తర్వాత ప్రేమగా మారింది. ఈ విషయం వారి తల్లిదండ్రులకు తెలియడంతో వీరిద్దరికీ పెళ్ళి చేయాలని నిర్ణయించారు. ఇదిలావుంటే, సౌందర్య మరో వ్యక్తితో మాట్లాడుతున్నట్టు తెలుసుకున్న దినేష్, ఆగ్రహంతో రగిలిపోయి, తన ప్రియురాలిని మందలించాడు. అప్పటికీ ఆమె ప్రవర్తన మార్చుకోకపోవడంతో ఆమెను కత్తితో పొడిచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడు కోసం గాలిస్తున్నారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో 6 కిలోల గంజాయి స్వాధీనం

● ప్రయాణికుడి అరెస్ట్

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లక్నో నుంచి రైలులో అక్రమంగా తరలించిన ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న సెంట్రల్ రైల్వేస్టేషన్ పోలీసులు ఓ ప్రయాణికుడిని అరెస్టు చేశారు. లక్నో నుంచి ఆదివారం ఉదయం సెంట్రల్‌కు వచ్చిన ప్రయాణికుల లగేజీని ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేశారు. అప్పుడు ఓ ప్రయాణికుడి లగేజీతో అనుమానంతో తనిఖీ చేసి అందులోవున్న రూ.6లక్షలు విలువచేసే 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడ్డ వ్యక్తి నగరానికి చెందిన చంద్రమౌళి (31)అని తేలింది. అదేవిధంగా పుళల్ సెంట్రల్ జైలులో ఉన్న ఖైదీలకు సరఫరా చేసేందుకు గంజాయితో వెళ్ళిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. టీపీచత్రం ప్రాంతానికి చెందిన గణేష్ (35)నుంచి పది గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి సమక్షంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో అటవీ శాఖ జాగిలం మృతి



మృతిచెందిన జాగిలం 'భైరవ'

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి సమీపంలో ప్రభుత్వ బస్సు ఢీకొని అటవీ శాఖ జాగిలం మృతి చెందింది. ఆనమలై పులుల శరణాలయం, పొల్లాచ్చి, మానాంపల్లి, టాప్‌స్లిప్ అటవీ రేంజ్ పరిధిలో అటవీ శాఖ, వేట నిరోధక బృందాల పోలీసులు సంయుక్తంగా గస్తీ తిరుగుతుంటారు. వారితో పాటు అటవీ శాఖకు చెందిన జాగిలం కూడా ఉంది. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం ఆనమలై పులుల శరణాలయం జాయింట్ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణం నుంచి బయటకు వచ్చిన జాగిలం ప్రభుత్వ బస్సు ఢీకొని మృతిచెందింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... వేట నిరోధక పనుల్లో 'భైరవ' అనే జాగిలం పాల్గొంటుందని, ఘటన జరిగిన భైరవాన్ని ప్రాంగణంలో వాకింగ్‌కు తీసుకెళ్తున్న సమయంలో, వీధి కుక్కల అరుపులు విన్న భైరవ, అటవీ సిబ్బంది నుంచి తప్పించుకుని వీధి కుక్కలపై దాడిచేసేందుకు బయటకు రావడంతో అటువైపు వచ్చిన ప్రభుత్వ బస్సు కింద పడి మృతిచెందిందని తెలిపారు.

కొశస్థలి నదిలో చమురుతెట్టు

● ఆందోళనలో మత్స్యకారులు



నదిలో పేరుకుపోతున్న చమురుతెట్టు

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొశస్థలి నదిలో చమురుతెట్టు చేరుతుండడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నూర్ సమీపంలోని కాట్టుకుప్పం ప్రాంతంలో ఉన్న బకింగ్‌హామ్ కాలువలో కలుస్తున్న ముడి చమురు వ్యర్థాలు, సమీపంలో కొశస్థలి నదిలో చేరుతున్నాయి. నీటిపై చమురు తెట్టు పేరుకుపోవడంతో నాటు పడవలు నడపలేని పరిస్థితి నెలకొనగా, ఆయిల్ వ్యర్థాల కారణంగా చేపలు కూడా మృతిచెందుతున్నాయని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించాలని జాలర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

కీళడి నివేదిక విడుదలకు డిమాండ్ చేస్తాం

● డీఎంకే ఎంపీ టీఆర్ బాలు

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కీళడి ప్రాంతంలో చేపట్టిన పరిశోధనల నివేదికను విడుదల చేయాల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని డీఎంకే లోక్‌సభ డీఎంకే ఎంపీల కమిటీల చైర్మెన్ టీఆర్. బాలు పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆదివారం ఢిల్లీలో కేంద్ర పార్లమెంట్ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజీజు అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో రాష్ట్రం తరుపున డీఎంకే ఎంపీ టీఆర్.బాలు, అన్నాడీఎంకే తరుపున డాక్టర్ తంబిదురై పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం టీఆర్.బాలు మీడియాతో మాట్లాడుతూ, సోమవారం ప్రారంభంకానున్న పార్లమెంట్ వర్షాకాలం సమావేశాల్లో తమిళనాడుకు సంబంధించి పెండింగులో ఉంచిన నిధులను విడుదల చేయాల్సిందిగా సమావేశంలో ప్రస్తావించామన్నారు. తమిళులకు చిరునామాగా ఉన్న కీళడి పరిశోధనల నివేదిక సవరించకుండా, అలాగే విడుదల చేయాలని కోరుతామని, ముఖ్యంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం గురించి కేంద్రాన్ని నిలదీయనున్నట్లు టీఆర్.బాలు తెలిపారు.

చెన్నై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

● ఆలస్యంగా బయలుదేరిన విదేశీ విమానాలు

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంలో పెట్టిన బాంబు ఏ నిమిషంలోనైనా పేలుతుందని ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు రావడంతో పోలీసులు, బాంబు స్క్వాడ్ నిపుణులు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. ఆదివారం ఉదయం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విదేశీ విమానాలు ఆలస్యంగా బయలుదేరడంతో ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. స్థానిక త్రిశూలం ప్రాంతంలోవున్న విమానాశ్రయానికి తరుచూ ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వస్తుండటంతో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, శనివారం అర్ధరాత్రి విమానాశ్రయ మేనేజర్‌కు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఈమెయిల్ ద్వారా పంపిన సమాచారంలో విమానాశ్రయ ప్రాంగణంలో పెట్టిన బాంబులు ఏ నిమిషంలోనైనా పేలే అవకాశముందని బెదిరించినట్లు తెలిసింది. ఈ బెదిరింపుఈ మెయిల్ విదేశాల నుంచి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో భద్రతాధికారులు, దర్యాప్తు అధికారులు, కస్టమ్స్ అధికారులు, సీఐఎస్ఎఫ్ బలగాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం ఈమెయిల్‌లో బెదిరించిన ప్రాంతం, ప్రయాణికుల విశ్రాంతి గదులు, ప్రవేశద్వారాలు, రన్‌వేపై విమానాలు బయలుదేరే ప్రాంతాలు, కార్గో, పార్కింగ్ ప్రాంతాల వద్ద పోలీసు జాగిలాలతో బాంబు స్క్వాడ్ నిపుణులు తనిఖీలు నిర్వహించారు. సుమారు 3 గంటల పాటు కొనసాగిన తనిఖీల్లో బాంబులు లేవని నిర్ధారించడంతో అధికారులు ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. తనిఖీల కారణంగా ఆదివారం ఉదయం హాంకాంగ్, కువైట్, దుబాయ్, షార్జా, ధోహా, మస్కట్, సింగపూర్, లండన్ తదితర దేశాలకు సుమారు గంట ఆలస్యంగా విమానాలు బయలుదేరాయి.

ఘనంగా కపాల కాళియమ్మాళ్ ఆలయ వేడుకలు



కలశాలతో పాల్గొన్న భక్తులు

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా కారియపట్టిలోని కపాలి కాళియమ్మాళ్ ఆలయ వర్షాభిషేక ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 16 అడుగుల ఎత్తున్న అమ్మవారి విగ్రహంతో 1,008 భక్తులు పాల కలశాలతో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఇలాంటి వేడుకలు నిర్వహిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకం. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

తాగునీటి కోసం గ్రామస్తుల రాస్తారోకో



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

పెరంబూర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ ఖాళీ బిందెలతో గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. తిరునల్వేలి జిల్లా కట్టనేరి గ్రామంలో నెలరోజులుగా సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని సమాచారం. గ్రామస్తులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయింది. దీంతో, గ్రామస్తులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడినా ఆందోళన విరమించలేదు. అంతలో అధికారులు వచ్చి సత్వరం తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీకి ఓటు బ్యాంకే గతి

● ఎంపీ కార్తీ చిదంబరం



చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) గెలిచి అధికారంలోకి రావటం అసాధ్యమని, రాష్ట్రంలో రెండు ద్రావిడ పార్టీలను వ్యతిరేకిస్తూ ఓటేసేవారున్నారని, అలాంటి ఓటర్లే విజయ్ పార్టీకి ఓటు వేసే అవకాశం ఉందని, కనుక అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీకి ఓటు బ్యాంక్ మాత్రమే లభిస్తుందని తెలిపారు. శివగంగ జిల్లా కారైక్కుడిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'రాజకీయ వ్యవస్థతో చట్టాన్ని కాపాడుదాం' పేరుతో ప్రచార పాదయాత్ర కార్తీ చిదంబరం నాయకత్వంలో ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో పాల్గొన్న కార్తీ చిదంబరం మీడియాతో మాట్లాడుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి బీజేపి వడిలో పడుకుని కమ్యూనిస్టు పార్టీలు, డీపీఐ తదితర పార్టీలను తమ కూటమిలో చేరడంటూ పిలుపునివ్వడం గర్హనీయమన్నారు. ఈ సారి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, డీఎంకే కూటముల మధ్యనే గట్టి పోటీ ఉంటుందన్నారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలలో టీవీకే గెలిచి అధికారంలోకి రావటం అసాధ్యమని, కాకపోతే ఆ పార్టీ తనకంటూ ప్రత్యేకంగా ఓటు బ్యాంక్ సంపాదించుకునే అవకాశం ఉంటుందన్నారు. అన్నాడీఎంకేకు ఉన్న బలం రెండాకుల చిహ్నమేనని ఆయన చెప్పారు.

మంటలు ఆర్పడంపై అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ



మంటలు ఆర్పే విధానాన్ని చూపిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులకు మంటలు ఆర్పడంపై జిల్లా అగ్నిమాపక శాఖ శిక్షణ ఇస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట చేసే సమయంలో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదాలు సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ ఇవ్వాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఆ ప్రకారం, తిరుకోవిలూరు తాలూకాలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి శనివారం మంటలు అదుపుచేయడంపై అగ్నిమాపక శాఖ అధికారులు శిక్షణ అందించారు.

తూత్తుకుడి అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన అటవీ శాఖ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. ఆ జిల్లాలోని వల్లనాడు కలైమాన్ అభయారణ్యం, కుదిరైమేడు (దేరికాడు) సాలికుళం అభయారణ్యం ప్రాంతాల్లో అటవీ శాఖ సిబ్బంది, కార్మికులు ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. సుమారు 350 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, నగరపంచాయతీ పారిశుధ్య కార్మికులు సహా సుమారు 200 మంది పాల్గొన్నారు.

సూర్య కిరణాల ద్వారా పెయింటింగులు

● తంజావూరు విద్యార్థి ప్రతిభ



సూర్య కిరణాల ద్వారా కామరాజర్ చిత్రాన్ని గీస్తున్న తరుణ్‌కుమార్

ప్యారీస్, జూలై 20(ఆంధ్రజ్యోతి): తంజావూరుకు చెందిన తరుణ్‌కుమార్ అనే విద్యార్థి చిత్రలేఖనంపై ఆసక్తితో సూర్య కిరణాల ద్వారా పెయింటింగ్స్ రూపొందించి తన ప్రతిభ చాటుకున్నారు. తంజావూరు కరంధై ప్రాంతానికి చెందిన ప్రేమ్‌కుమార్ కుమారుడు తరుణ్‌కుమార్ ఆ ప్రాంతంలోని ఓ కళాశాలలో ఆర్కిటెక్చర్ కోర్సులో నాలుగేళ్ళుగా చదువుతున్నాడు. బాల్యం నుంచే పెయింటింగ్స్ మినియేచర్ చిత్రాలు గీయడంలో ఆసక్తి పెంచుకున్న తరుణ్‌కుమార్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న సూర్యకిరణాలతో చిత్రాలు వేసి అందరిని ఆకట్టుకుంటున్నాడు. దీనిపై అతని తండ్రి ప్రేమ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ, రాజరాజ చోళ చక్రవర్తితో పాటు రాజకీయ ప్రముఖులు, క్రీడాకారులు, సినీకళాకారులు తదితర చిత్రాలను లెన్స్‌పై సూర్యకిరణాలు పడేలా చేసి రూపొందించాడని, ఈ పెయింటింగ్స్ సుమారు 400యేళ్ళపాటు చెక్కుచెదరకుండా ఉంటాయని తెలిపారు. రోజంతా మండుటెండలో నిలబడి చిత్రాలు గీస్తే, రాత్రి నిద్ర సరిగా పట్టదని, కళ్లు మంటలతో బాధపడుతుంటాడని, అయినా పెయింటింగ్‌లో సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలన్న లక్ష్యంతో తరుణ్‌కుమార్ శ్రమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వన్నియార్ల రిజర్వేషన్ కోసం పీఎంకే ధర్నా



కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న అన్బుమణి

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వన్నియర్లకు జనాభా ప్రాతిపదికన 10.5 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని పీఎంకే ఎంపీ అన్బుమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వన్నియర్లకు రిజర్వేషన్ వర్తింపజేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు 1200 రోజులు గడిచినా అమలుపరచని డీఎంకే ప్రభుత్వ వైఖరి తప్పుబడుతూ విల్లుపురంలో ఆదివారం పీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇందులో అన్బుమణి పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో అధికశాతమున్న విన్నియర్లకు 10.5 శాతం రిజర్వేషన్ కల్పించకుండా రాష్ట్రప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఈ నాలుగేళ్ళలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ ధర్నాలో విల్లుపురం, కళ్లకురిచ్చి జిల్లా పీఎంకే నిర్వాహకులు, వన్నియర్ సంఘాల కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తైలాపురం గార్డెన్‌లో వేడుకలు జరుపుకున్న రాందాస్..

విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో ఆదివారం జరిగిన వన్నియర్ సంఘం 46వ వార్షిక ఆవిర్భావ వేడుకల్లో పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ పాల్గొన్నారు. వేదిక ప్రాంగణంలో వన్నియర్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించి కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పూంపుహార్‌లో నిర్వహించనున్న మహానాడులో పీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా రాందాస్ పిలుపునిచ్చారు.

జీవీ ప్రకాష్ 'బ్లాక్‌మెయిల్' ఆడియో రిలీజ్

ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన 'బ్లాక్‌మెయిల్' ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. జేడీఎస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై అమల్‌రాజ్ నిర్మాణ సారథ్యంలో ము.మారన్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందించారు. తేజు అశ్విని, బిందు మాధవి హీరోయిన్లుగా నటించగా, ఆగస్టు 1న విడుదల చేయనున్నారు. మూవీ ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా నగరంలో ఆడియో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ దర్శకులు ఆర్వీ ఉదయకుమార్, ఆధిక్ రవిచంద్రన్, వసంత బాలన్, నిర్మాతలు ధనంజయన్, కదిరేశన్, డ్రీమ్ వారియర్స్ సీఈవో గుహన్ అతిథులుగా పాల్గొని ఆడియో రిలీజ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. హీరో ధనుష్ తన ఎక్స్ హ్యాండిల్‌లో రిలీజ్ చేశారు.



జీవీ ప్రకాష్ కుమార్ - తేజు అశ్విని

ఈ సందర్భంగా హీరో జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'దర్శకుడు మారన్ ఎంతో ప్రతిభావంతుడు. నిర్మాత అమల్‌రాజ్‌కు ధన్యవాదాలు. హీరోయిన్ తేజుతో కలిసి ఇన్‌స్టాలో డ్యాన్స్ చేశాను. ఆ వీడియో వైరల్ కావడంతో ఈ సినిమాలో ఎంపిక చేసారన్నారు. దర్శకుడు మారన్ మాట్లాడుతూ, 'జీవీ ప్రకాష్, అమల్‌రాజ్‌తో కలిసి పనిచేయడం భాగ్యంగా భావిస్తున్నాను. కేవలం థ్రిల్లర్ జోనర్‌లోనే కాకుండా కామెడీ, సెంటిమెంట్, కామెడీ ఇలా అన్ని అంశాలతో ఈ మూవీని రూపొందించాం. నిర్మాత అమల్‌రాజ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం సగం పారితోషికాన్ని మాత్రమే తీసుకున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా డబ్బింగ్ పూర్తి చేయడంతో పాటు ఆడియో లాంచ్ వరకు తీసుకొచ్చారు. హీరోకు ఎప్పటికీ రుణపడి వుంటాను' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు శ్యామ్ సీఎస్ మాట్లాడుతూ, 'ఈ మూవీలో మూడు పాటలతో పాటు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించాను. దర్శకుడు మారన్‌తో ఇది నాకు రెండో చిత్రం. ఈ ఆడియో కార్యక్రమంలో గేయరచయిత కార్తీక్ నేత, చిత్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బమ్ సృష్టికర్తలకు కమల్ అభినందనలు

ప్రముఖ ఆడియో కంపెనీ సరిగమ ఒరిజినల్స్ యువ సంగీత కళాకారులతో రూపొందించి విడుదల చేసిన 'చీ పా ధూ' అనే ఆల్బమ్ సాంగ్‌ను అగ్రనటుడు కమల్ హాసన్ వీక్షించడంతో పాటు ఈ పాటను రూపొందించిన వారికి ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆల్బమ్ సాంగ్‌కు తరణ్‌కుమార్ సంగీతం సమకూర్చగా, వహీసన్ రాసయ్య గేయరచన చేశారు. ప్రముఖ స్వరకర్త సంతోష్ నారాయణన్, వహీసన్ రాసయ్య నేపథ్యగానం చేయగా, శక్తివేల్, మాస్టర్ రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. ఈ మ్యూజిక్ ఆల్బమ్‌కు ఆనందు దర్శకత్వం వహించారు. ఈ ఆల్బమ్ సాంగ్ చూసిన కమల్ హాసన్ పాటకు ముగ్ధుడై.. ఆ ఆల్బమ్ కళాకారుల బృందానికి ఫోన్ చేసి వారి ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాగే, తన కార్యాలయానికి పిలిపించి.. వారిని అభినందించారు.



యువ సంగీత కళాకారులతో కమల్

కోలీవుడ్‌ను శాసిస్తున్న కంటెంట్

హీరో ఉదయ

చిత్రజ్యోతి

కోలీవుడ్‌ను ప్రస్తుతం కంటెంట్ (కథలు) శాసిస్తుందని, ఇటీవలికాలంలో మంచి కథాంశంతో కూడిన చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారని హీరో ఉదయ అన్నారు. అజ్మల్, యోగిబాబుతో కలిసి ఉదయ ప్రధాన పాత్ర పోషించిన తాజా చిత్రం 'అక్యూస్డ్'. ఈ సినిమా విశేషాలను వెల్లడించేందుకు చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో ఉదయ మాట్లాడుతూ, 'మూడేళ్ళ విరామం తర్వాత మళ్ళీ నటిస్తున్నాను. నేను ఇండస్ట్రీకి పరిచయమై 25 యేళ్ళ పూర్తయ్యాయి. ఇప్పటివరకు ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. కోలీవుడ్‌ను కంటెంట్ శాసిస్తోంది. మంచి కథలతో వచ్చే చిత్రాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఆ విధంగా ఈ సినిమా కూడా ఖచ్చితంగా సక్సెస్ సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అన్నారు. నటుడు అజ్మల్ మాట్లాడుతూ, 'విజయం సాధించాలన్న పట్టుదలతో ఒక వ్యక్తి ముందుకు సాగితే అతడికి యావత్ ప్రపంచం అండగా నిలుస్తుంది. దీనికి ఉదయ చక్కటి ఉదాహరణ అని అన్నారు. హీరోయిన్ జాన్వికా మాట్లాడుతూ, 'ఇది నా తొలి తమిళ సినిమా. ఆగస్టు 1న విడుదలకానుంది. మీరంతా ఆదరించాలి అని కోరారు. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని జేసస్ స్టూడియోస్, సచిన్ సినిమాస్, దయాకరన్ సినీ ప్రొడక్షన్స్, షై స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి.



మీడియా సమావేశంలో చిత్ర బృందం

ప్రతి తప్పూ ఒక పాఠాన్ని నేర్పుతుంది

● తమన్నా



జీవితంలో మనం చేసే ప్రతి తప్పు ఒక్కో పాఠాన్ని నేర్పుతుందని ప్రముఖ హీరోయిన్ తమన్నా అభిప్రాయపడ్డారు. మిల్కీ బ్యూటీ తమన్నా తమిళంలో అధిక సంఖ్యలో సినిమాల్లో నటించకపోయినప్పటికీ ప్రత్యేక గుర్తింపు మాత్రం ఉంది. ఆమె తమిళంలో చివరగా నటించిన చిత్రం 'అరణ్మనై-4'. సుందర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. ఆ తర్వాత రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో 'కావాలా' అనే ప్రత్యేక గీతంలో నర్తించగా, ఈ పాట సూపర్‌డూపర్ హిట్ అయింది. ఈ నేపథ్యంలో ఆమె తన ఇన్‌స్టాలో చేసిన ఓ పోస్ట్ వైరల్ అయింది. 'ఇది ఎంతో కీలకమైన దశ. మనం ఎదుర్కొనే ప్రతి అంశం ఎంతో ముఖ్యమైనది. ప్రతి తప్పు ఒక పాఠాన్ని నేర్పుతుంది. అనేక ఆలోచనలుంటాయి. ఇవి పరిపూర్ణం కావు. నిజాయితీగా చెప్పాలంటే ఇది ఒక మాయాజాలం. ప్రతి పనివెనుక ఒక ప్రక్రియ ఉంటుంది. మన జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవం ఒక మంచి పాఠాన్ని నేర్పుతుంది' అంటూ తమన్నా వేదాంత ధోరణితో పోస్ట్ చేయడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

భవానీదేవి ఆలయంలో
సుమంగళి పూజ

● 20వేల మందికి పసుపు కుంకుమ పంపిణీ



మహిళలకు పసుపు కుంకుమ అందజేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయంలో ప్రసిద్ధిగాంచిన భవాని అమ్మవారి ఆలయంలో ఆడి మాసం తొలి ఆదివారం సందర్భంగా సుమంగళి పూజ నిర్వహించారు. అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్న హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు భక్తులకు రాగి అంబలి, 20వేల మంది మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. ఈ ఆలయంలో ఆడి మాసం ఉత్సవాలను 14 వారాల పాటు విశేషంగా జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 17న ఆడి ఉత్సవాలు స్తంభ స్థాపన పూజతో ప్రారంభం కాగా, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. శనివారం రాత్రి ఈ ఆలయ ప్రాంగణంలో బస చేసిన భక్తులు ఆదివారం ఉదయం పొంగళి వండి అమ్మవారికి నైవేద్యం చేశారు. అనంతరం వేపాకులను శరీరానికి కప్పుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. మరికొంతమంది భక్తులు, కోళ్లు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ ప్రతాప్ నేతృత్వంలో నిర్వహించిన సుమంగళి పూజలో హిందూ దేవాదాయశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనగా, పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.

వీఎస్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
క్యాన్సర్ చికిత్సపై సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వీఎస్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ చికిత్సా విధానాలపై 'వీఎస్ ఇంటర్నేషనల్ ప్రెసిషన్ అంకాలజీ సమ్మిట్ (వీఐపీఓఎస్ 2025) పేరుతో నిర్వహించిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈసదస్సులో రేడియేషన్ అంకాలజిస్టులు, వైద్యనిపుణులు, పాథాలజిస్టులు, జన్యు శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పీజీ విద్యార్థులు సహా సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. క్యాన్సర్‌ను నిర్ధారించేందుకు కొత్తగా వచ్చిన సాంకేతిక పరికరాలు, నూతన చికిత్సా విధానం, నిర్దిష్ట చికిత్సా విధానాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సదస్సులో వైద్యనిపుణులు ప్రొఫెసర్ ఎస్.సుబ్రమణియన్, డాక్టర్ రమేష్ బీవీ నిమ్మగడ్డ, డాక్టర్ ఎస్.నిత్యా, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ సుందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముత్తు సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు ఆస్కాట్రస్ట్ చేయూత

● నిత్యావసర సరుకుల వితరణ



ఆశ్రమ కార్యదర్శి లలితా మురళీకి సరుకులు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పెరంబూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ట్రస్ట్ మానసిక దివ్యాంగులకు చేయూతనిచ్చింది. ఆదివారం ఉదయం మధురవాయల్‌లో ఉన్న మానస స్కూల్ ఆఫ్ స్పెషల్ చిల్డ్రన్స్ ఆశ్రమానికి వెళ్లిన ఆస్కా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి కోటారెడ్డి, ట్రస్ట్ సెక్రటరీ టి.సంతోష్‌కుమార్, ట్రస్ట్ కోశాధికారి బీవీఎస్ కోటేశ్వరరావు అక్కడున్న మానసిక వైకల్య చిన్నారులను ఆప్యాయంగా పలుకరించి, వారితో కాసేపు గడిపారు. అనంతరం ఆస్కా ట్రస్ట్ తరఫున ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆశ్రమ కార్యదర్శి లలితకు అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ... మానసికంగా ఎదగని చిన్నారులతో కొంత సమయం గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. మానసిక చిన్నారులకు చేయూత నిచ్చే విధంగా ఆస్కా ట్రస్ట్ తరపున నిత్యావసర సరుకులు అందజేశామని, అవసరమైతే మరింత ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్కా ట్రస్టీలు విజయేంద్రరావు, ముంద్రు శ్రీనివాసరావు, వడ్లమాని బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.







తిరుత్తణికి కావళ్లతో వస్తున్న భక్తులు - కిక్కిరిసిన తిరుత్తణి ఆలయం - వడపళని ఆలయం ముందు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాల్లో
వైభవంగా ఆడి కృతిక

● పోటెత్తిన భక్తులు



ఆడికృత్తిక సందర్భంగా తిరుచెందూరు ఆలయం వద్ద భక్తజనసందోహం





ఇష్టదేవేరులతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి - వడపళని ఆలయంలో విశేషాలంకరణలో బాలమురుగన్

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడి మాసం నాలుగో రోజైన ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సుబ్రహ్మణ్యస్వామివారి దివ్య క్షేత్రాల్లో ఆడి కృతిక వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ క్షేత్రాలకు పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారిని దర్శించుకున్నారు. తమిళ మాసాల్లోని ఆడి మాసం అమ్మవార్లతో పాటు సుబ్రహ్మణ్యస్వామికి కూడా ప్రీతికరం. ఆడి కృతిక నక్షత్రానికి మరిన్ని ప్రత్యేకతలున్నాయి. ఈ సందర్భంగా వ్రతం చేపట్టిన భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచి కావళ్లు మోసుకుంటూ పాదయాత్రగా ఆయా జిల్లాల్లోని మురుగన్‌ఆలయాలకు వెళ్లారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లో కావళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మదురై సమీపంలోని తిరుప్పరంకుండ్రం, తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూర్, దిండుగల్ జిల్లా పళని, తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి, తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని స్వామిమలై పళముదిర్‌చోలై తదితర ఆరుపడై క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తిరుత్తణి ఆలయంలో భక్తులను క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించారు. అదేవిధంగా వడపళని మురుగన్ ఆలయానికి పుష్ప కావడి, పన్నీరు కావడి, నెమలి ఈకల కావడి అని వివిధ రకాల కావళ్లతో భక్తులు పోటెత్తారు. మరోవైపు మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా వెళ్ళి క్షీరాభిషేక పూజల్లో పాల్గొన్నారు. వడపళని ప్రాంతంలో ఆడి కృతిక పర్వదినం సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు భక్తులకు తాగు నీరు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్లు, చిన్నపిల్లలతో వచ్చేవారు, దివ్యాంగులను ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించారు. అదేవిధంగా ప్యారీస్‌లోని కందకోట్టమ్ కందస్వామి ఆలయం, కుండ్రత్తూరు కుమరన్ ఆలయం, చెంగల్పట్టు జిల్లా తిరుక్కలికుండ్రం వేదగిరీశ్వరాలయాల్లో ఆడి కృతిక సందర్భంగా స్వామివార్లను అలంకరించి మహా దీపారాధన చేశారు. తిరుక్కలికుండ్రంలో త్రిపుర సుందరి అమ్మవారికి ఆడిపూర తిరుకల్యాణ వైభవం జరగనుంది. ఇందులో ప్రధానాంశమైన ఈ నెల 24న రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు పలు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ముత్తుమారియమ్మన్ ఆలయంలో
వైభవంగా 'ఆడి ఆదివారం'



క్షీరకలశాలతో ఊరేగింపు - పూలతో తయారైన అమ్మవారి ప్రతిమలతో భక్తులు



భక్తురాలికి పూనకం





నోటికి శూలాలు గుచ్చుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు



ఇనుపకొక్కికి తాడు కట్టుకుని కొబ్బరిబోండాలను లాగుతూ వెళ్తున్న భక్తులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొరట్టూరు ముత్తుమారియమ్మన్ ఆలయంలో ఆషాడ ఆదివారం ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా భక్తులు శిరస్సుపై క్షీరకలశాలు ఉంచుకుని అమ్మవారికి సమర్పించారు. ఆ తర్వాత నోటికి శూలాలు గుచ్చుకుని, వీపునకు కొక్కేల దారాలు కట్టుకుని కొబ్బరి బోండాలను లాగుతూ భక్తులు విన్యాసాలు చేస్తూ స్వామివారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లారు. మరికొంతమంది భక్తులు అమ్మవారి రూపాలను పూలతో అలంకరించి తలపై పెట్టుకుని ఊరేగుతూ ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు ఆలయంలోని మూలవిరాట్టుకు అర్చకులు వేకువ జామున ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పూలతో అలంకరించారు. ఆ తర్వా భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.

తేనెకంటే తియ్యనిది తెలుగు

● డబ్ల్యూఎంటీబీసీ కోతకాల పండుగలో వక్తలు

ప్యారీస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష తేనెకంటే తియ్యదనంగా ఉంటుందని, అందువల్లే తమిళ మహాకవి సుబ్రమణ్య భారతీయార్ సుందర తెలుంగు అని వర్ణించారని పెరంబూరులోని వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘం (డబ్ల్యూఎంటీబీసీ)లో ఆదివారం నిర్వహించిన కోతకాలపు వేడుకల్లో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏడాదిలో కోసిన పంటలో, సంపాదనలో దశమ భాగాన్ని భక్తులు దేవునికి కానుకగా సమర్పించే వేడుకను తెలుగు బాప్టిస్ట్ క్రైస్తవులు కోతకాలపు పండుగ, కానుకల పండుగగా ప్రతిఏటా జరుపుకుంటుంటారు. ఇందులో భాగంగా ఆదివారం దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతూ డబ్ల్యూఎంటీబీసీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలను సంఘ కాపరి రెవ. డా.పాల్ ఈశ్వరప్ప ప్రారంభించి, అసిస్టెంట్ పాస్టర్ రెవ.ఆరోన్‌దయాన్‌తో కలిసి 10, 12వ తరగతుల పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలను సంఘ నిర్వాహకుల తరుపున అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధురమైన తెలుగు భాషకు ఇతర భాషల కంటే ఘనమైన చరిత్ర ఉందని, తెలుగు మీడియంలో చదువుకున్నవారెందరో రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించారన్నారు. ఈ సంఘం తరుపున సంవత్సరమంతటా జరుపుకునే కార్యక్రమాలన్నీ తెలుగులోనే ఉంటాయని, దీనివల్ల మాతృభాషాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కోతకాలపు పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో స్త్రీలు, యువజన, సండే స్కూల్, సంఘ కమిటీల సభ్యులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఆంధ్రావంటలు నోరూరించే బొబ్బట్లు, జంతికలు, పునుగులు, అరిసెలు, పూతరేకులతో పాటు నాటు కోడికూర, బిరియాని తదితరాలను ఆహార ప్రియులు తృప్తిగా ఆరగించారు. నిర్వాహకులు లేబాకు మోహన్‌కుమార్, పదర్ల శామ్‌సన్, గౌడిపేరు నాగేశ్వరరావు, డీజే ఏషియాబాబు, బండారు జీవన్‌బాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నగదు పురస్కారం అందుకున్న టాపర్లతో పాస్టర్లు, నిర్వాహకులు



ఆంధ్రావంటల స్టాల్‌లో స్త్రీల విభాగం నిర్వాహకులు

గుడిపేరుతో క్షుద్రపూజలు

ఆక్రమణను ధ్వంసం చేసిన కొండూరు గ్రామస్తులు



స్థానికులకు సర్దిచెబుతున్న పోలీసులు

తడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుడిపేరుతో క్షుద్రపూజలు నిర్వహిస్తూ గ్రామానికి అరిష్టం చేస్తున్నారంటూ కొండూరు గ్రామస్తులు ఆలయ ఆవరణాన్ని ధ్వంసం చేశారు. మండల పరిధిలోని కొండూరు గ్రామం జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి చాముండేశ్వరి ఆలయం పేరుతో చిన్నపాటి తాత్కలిక గుడి నిర్మించారు. ఇందుకు గ్రామంలోని ఓ వర్గం మద్దతు తెలపగా మరోవర్గం వ్యతిరేకిస్తూ వచ్చింది. గుడిపేరుతో క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్లారు. ఆదివారం గ్రామస్తులు మూకుమ్మడిగా ఆ గుడివద్దకు చేరుకొని తాత్కలికంగా వేసిన షెడ్‌లను ధ్వంసం చేశారు. అనంతరం జాతీయ రహ దారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. తమ గ్రామంలో క్షుద్రపూజలు నిర్వహిస్తుండటంతో కొంతమంది చనిపోయారని, ఆ గుడిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చచెప్పడంతో గ్రామస్తులు అక్కడ నుంచి వెనుతిరిగారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదాం

ఏఐటీయూసీ పిలుపు

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆగస్టు 7నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు. ఈనెల 27న గూడూరులో జరగనున్న ఏఐటీయూసీ ప్లీనరి సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, నారాయణ, ఉదయ్‌కుమార్, చాముండేశ్వరి, సీవీఆర్ కుమార్, యాకోబు, గోపి, రాములు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

నడకతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నడకతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ సూచించారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి మునికృష్ణయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ రావిళ్ల మాధవనాయుడు, మాజీ అధ్యక్షుడు రామచంద్రానాయుడు, మహమ్మద్ రఫి, రఘునాథ రెడ్డి, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే భాను పరామర్శ



వడమాలపేట,జూలై 20 (ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటనలో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరా మర్శించారు. శనివారం రేణిగుంట విమానాశ్రయంలో తీవ్రంగా గాయ పడి న విషయం తెలిసిందే. అమర హాస్పిటల్‌లో ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ ప్ర మా దం దురదృష్టవశాత్తు జరిగిందని, టీడీపీ అండగా ఉంటుందన్నారు. తొందరలో కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని బాధితుడికి భరోసా ఇచ్చారు. పరిశీలించిన వారిలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, దేవనందం నాయుడు, వడమాల పేట మండల టీడీపీ అధ్యక్షులు దాముయాదవ్, కార్యదర్శి శివరాయల్ తదితరులు ఉన్నారు.

వేడుకగా ఆడికృత్తిక



పుత్తూరు టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక పురస్కరించుకుని పుత్తూరు పట్టణంలోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, గొల్లపల్లి సమీపంలోని మలేసియా మురగన్ ఆలయాలకు భక్తులు కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల హరోంహర నామస్మరణలో పట్టణం మార్మోగింది.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

పుత్తూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కృషి చేస్తున్నారని పుత్తూరు పట్టణ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు దిలీప్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో జరగని అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ఎమ్మెల్యే చేసి చూపించారని కొనియాడారు. ప్రజా ధనాన్ని, ప్రకృతి సంపదను కొల్లగొట్టే పార్టీగా వైసీపీని ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని దేవుడు కూడా క్షమించరన్నారు. నోరు పారేసుకుంటేనే గుర్తింపు లభిస్తుందని భావించిన మాజీ మంత్రికి గత ఎన్నికల్లో 45 వేల ఓట్ల మెజారిటీ దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా హుందాగా రాజకీయం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పార్తిబన్, ముని, వాణి, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసన



నిరసన కార్యక్రమంలో రోజా తదితరులు

పుత్తూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ఆదివారం మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ వైసీపీ నాయకులు నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు జరుగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం/కేవీబీపురం: అక్రమ అరెస్టులతో ప్రజాభిమానాన్ని ఆపలేరంటూ ఉమ్మడి జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ధనంజయులురెడ్డి పేర్కొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు

పెళ్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి దళితవాడలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. దళితవాడకు చెందిన బాలకృష్ణపై అదే గ్రామానికి చెందిన లోకేష్, చలపతి, రమణమ్మ తదితరులు దాడికి పాల్పడి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

యువకుడి ఆత్మహత్య



నాయుడుపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో ఆలయం వెనుక చెట్టుకు ఉరివేసుకొని గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం చెట్టుకు ఉరివేసుకున్న వ్యక్తిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





తొణుకుమాల సమీపంలో నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు - అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు (ఫైల్‌ఫొటో)

అండర్‌పాస్ నిర్మించకపోతే అవస్థలే!

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొణుకుమాల, ఉడతావారిపార్లపల్లి, తిక్కవరం గ్రామాలకు సమీపంలోని సాగరమాల రహదారిపై అండర్‌పాస్ నిర్మించకపోతే రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని తొణుకుమాల, తిక్కవరం, ఉడతావారిపార్లపల్లి గ్రామాల సమీపంలో సాగరమాల రహదారి పనులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అండర్‌పాస్ నిర్మించడం లేదని, దీంతో తమకు దీర్ఘకాలిక అవస్థలు తప్పవని అంటున్నారు. ప్రధానంగా తొణుకుమాల, ఉడతావారిపార్లపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు తిక్కవరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లిరావాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. అండర్‌పాస్ లేకపోతే సుమారు మూడు కిలోమీటర్లు వరకు చుట్టుతిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంటుందని, విద్యార్థులతో పాటు పలు పనుల నిమిత్తం తిక్కవరం గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అదేవిధంగా యోగేశ్వరపల్లిలోని కొంత మంది రైతులకు తొణుమాల సమీపంలోని పొలాలు ఉండడంతో వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని అంటున్నారు. అండర్‌పాస్ నిర్మించాలని ఇటీవల ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపై ఆందోళన చేపట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు స్పందించి అండర్‌పాస్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సర్టిఫికెట్లపై ప్రభుత్వ చిహ్నాలే ఉంటాయ్: మంత్రి సంధ్యారాణి



సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

నాయుడుపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు జారీచేసే సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు, భూములు పాస్ పుస్తకాలపై రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాలే ఉంటాయని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం నాయుడుపేట ఏఎంసీ గోదాము ప్రాంగణంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతే తరతరాలుగా, వంశపారంపర్యంగా వస్తున్న భూముల పాస్ పుస్తకాలతో పాటు అన్ని సర్టిఫికెట్లపై గత వైసీపీ ప్రభుత్వం దిష్టిబొమ్మల్లా ఫొటోలు ముద్రించిందని విమర్శించారు. అవినీతి, అరాచక పాలనను భరించలేక ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా కేవలం 11 సీట్లకే పరి మితం చేశారన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో కుటుంబంలో ఒక్క బిడ్డకే సంక్షేమం అందజేస్తే, ఎన్డీఏ ప్రభుత్వంలో తల్లికి వందనంతో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున అందజేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి కేవలం రూ.5కే మూడు పూట్లా సంతృప్తికరమైన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరుగు తుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, అరవపెరిమిడి చంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్లు ఉయ్యాల ప్రవీణ్, ఆకుతోట రమేష్, మండల అధ్యక్షుడు సంచి కృష్ణ య్య, విజయమోహన్ నాయుడు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, మధుసూదనరెడ్డి, షైలారి రాజశేఖర్, దార్ల రాజేంద్ర, పొట్లపూడి రాజేష్, మొండెం బాబు, మాజీ ఎంపీపీ కన్నెమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త రాజ్యాంగం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మాజీ ఎంపీ నెలవల, రచయిత పేర్నాటి తదితరులు

నాయుడుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'స్వతంత్ర భారతదేశం-రాజ్యాంగ నిర్మాణం' పేరిట న్యాయవాది పేర్నాటి వెంకటేశ్వర్లు రచించిన సంక్షిప్త రాజ్యాంగం పుస్తకాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఆదివారం నాయుడుపేటలోని ఎంకే కన్వన్షన్ హాలులో పుస్తకావిష్కరణలో నెలవల మాట్లాడుతూ 395 ఆర్టికల్స్‌తో 1500 పేజీలున్న రాజ్యాంగాన్ని 142పేజీలతో సంక్షిప్తంగా రచించిన పేర్నాటి వెంకటేశ్వర్లును అభినందించారు. రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా అభ్యసించి అందరికీ అర్థమయ్యేరీతిలో రచించిన ఈ పుస్తకం భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఎంఈవో మునిరత్నం, రామచంద్రారెడ్డి, మాజీ ఎంఈవో శ్రీనివాసులు, బందిల మోహన్, ట్రినేటి సూపర్ స్పెషాలిటీ సీఈవో నాగూరయ్య, రామకృష్ణ, సుధాకర్, న్యాయవాది చదలవాడ కుమార్, సీవీరామన్ డైరెక్టర్ గోపీ, నవోదయ పద్మనాభరెడ్డి, శ్రీవేమ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో మంత్రి సంధ్యారాణి



మంత్రి సంధ్యారాణికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సహాయ కమిషన్ ప్రసన్న లక్ష్మి, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల తదితరులు

సూళ్లూరుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరిని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయం వద్ద ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల మంజూరు చేయండి

పెళ్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణికి టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలో గురుకుల పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అత్యధికంగా ఉన్న పెళ్లకూరు మండలానికి గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని కోరారు.

ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనను వివరించండి: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 80శాతం అమలు చేసిందన్నారు. ఏడాదిలో ఎంతో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఇవన్నీ ప్రజలకు వివరించాలన్నారు. చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోడం వల్లే 2019లో ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ పరిస్థితి పునరావృతంగా కాకుండా ఉండాలంటే పార్టీలో అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే పార్టీలో గుర్తింపు ఉంటుందని, వైసీపీ చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నిలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతమైన వ్యక్తులతో కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ అదిష్టానం నిర్ణయించిందని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జన్ని రమణయ్య చెప్పారు. అందరూ సమష్టిగా కృషిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు అన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు బొమ్మిని పళని, నారాయణరెడ్డి, మాధవరావు, బాబు నాయుడు, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం మండలాల అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రావి మస్తాన్ నాయుడు, దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి: పాశిం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కేసులు పెట్టకుండా ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులకు అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులను వేధిస్తూ అక్రమలు కేసులు పెట్టారన్నారు. తాము అధికారంలో ఉన్నా ఈ తరహా చర్యలకు పాల్పడలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం సిలికా, క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌ను యదేచ్ఛగా కొనసాగించారన్నారు. తాను నిత్యం ప్రజల్లోనే ఉంటానని, దీనిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, జహంగీర్, సిద్దయ్యనాయుడు, రవీంద్రరెడ్డి, ఇశ్రాయిల్ కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో వేలాయుధాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు - తడలో కావడితో వెళ్తున్న భక్తులు

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయా లయ్యాయి. స్థానిక బోడిలింగాలపాడుకు చెందిన అయ్యంగోళం ధనుష్ ఆదివారం జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. తిరిగివెళ్తూ రోడ్డు దాటు తుండగా చెన్నై వైపు వెళ్తున్న ఓ కారు అతనిని ఢీకొంది. గాయపడిన ధనుష్‌ను స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసు లకు ఫిర్యాదు అందలేదు.

కారును ఢీకొన్న బస్సు

నాయుడుపేట టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ జాతీయ రహదారి కూడలి వద్ద కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆదివారం చెన్నై నుంచి వరంగల్ వెళ్తున్న కారును మల్లాం జంక్షన్ మలుపు వద్ద బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శాకాంబరి అలంకారంలో కన్యకా పరమేశ్వరి

కోట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోటలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరిని ఆదివారం వేదపండితులు శాకాంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 51 రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు





చిట్టమూరు: గ్రామోత్సవంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి - కోట: విశేష అలంకారంలో బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

చిట్టమూరు, జులై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాంలో వెలసిన స్వయంభు వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ చెర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం, స్వయంభు మూర్తికి పాలాభిషేకం, అష్టోత్తర కలిశాభిషేకం, అమృతాభిషేకం నిర్వహించారు. నూరు స్తంభాల కల్యాణ మండపంలో జరిగిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అదేవిధంగా అరవపాళెం సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు జరిగాయి.

కోట: పట్టణ పరిధిలోని కొక్కుపాడు సమీపంలో ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు కావిడిలు ఎత్తుకొని హరోహర నామాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. కోట పట్టణానికి చెందిన సారంగం సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి భక్తులు 108 వేలాయుధాలతో పట్టణ పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు.

తడ: మండల పరిధిలోని చిన్నమాంబట్టులో ఉన్నకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు. తిరుపతి సిమ్స్ వైద్యుడు కారణి మునస్వామి ఆధ్వర్యంలో భక్తులు కావళ్లను మోసుకుంటూ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోపూజ జరిగింది.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్ సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో వెంకటనారాయణ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, సుమన్ రెడ్డి, రాధయ్య, శ్రీనివాసాచారి, అరుణ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.